


# మన దునియా

RNI Number TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం


రిపోర్టర్లు కావలెను
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
మన దునియా
ఇంకెందుకు ఆలస్యం...
9490056011,9603969335


సంపుటి : 3 | సంచిక : 2510 | మే 8 శుక్రవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-




**మన దునియా,కరీంనగర్ జిల్లా: మే 07**

తెలంగాణ లో తెలంగాణ వ్యాప్తంగా ముఖ్య పట్టణాలలో జరుగుతున్న "లాడ్జి సెంటర్ లాజిక్" ఇప్పుడు అందరిని ఆలోచింపజేస్తుంది.. ఒక పోలీస్ శాఖ నిర్లక్ష్యమే కాదు లాడ్జిలలో డబ్బుల కోసం ఎవడికి పడితే వాడికి రూములు (షెల్టర్) లాడ్జి నిర్వాహకులు ఇవ్వడం చట్టపరంగా నేరమే.. కరీంనగర్ గోల్డ్ రాబరీ నిందితులు మే 1 న..ధర్మపురి లాడ్జిలో బస చేసి పక్కాగా రెక్కి నిర్వహించి ..మే 3 న కరీంనగర్ పీఎంజీ జ్యువలరీ దోపిడీకి పాల్పడినట్లుగా పోలీసులు గుర్తించారు. బంగారు దుకాణం లో దోపిడీ చేసేందుకై రెండు రోజుల నుండి ధర్మపురి షెల్టర్ గా చేసుకున్నారని పోలీసుల దర్యాప్తులో బయటపడ్డది..

కరీంనగర్ గోల్డ్ రాబరీ

కరీంనగర్ లోని జ్యోతినగర్ వద్ద ఉన్న పీఎంజే జ్యువెలరీ షాప్ లో 2026 మే 3, ఆదివారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో రాబరీ సంఘటన చోటు చేసుకుంది... రాబరీ జరిగిన సంఘటన వివరాలను ప్రకారం... ఐదుగురు ఆయుధాలతో (తుపాకులతో) కస్టమర్ల రూపంలో షాపులోకి చొరబడి, 1 కేజీకి పైగా బంగారం దోచుకెళ్లారు.. దొంగలు జరిపిన కాల్పుల్లో ముగ్గురు సిబ్బంది గాయపడ్డారు.నిందితులు దొంగలు హిందీ, తెలుగులో మాట్లాడారని పోలీస్ లు గుర్తించారు, సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేసి, సెక్యూరిటీ గార్డుకు గంతలు కట్టి పారిపోయారు. దీనితో పోలీసుల సిసిటివి ఆధారంగా నిందితుల కోసం 12 ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

నిందితులు దొంగ పేరుతో... డూప్లికేట్ ఐడి ప్రూఫ్ లతో

గోల్డ్ రాబరీ నిందితులు ధర్మపురి లాడ్జిలో సౌరవ్ కుమార్ అనే దొంగ పేరుతో రెండు రూములు అద్దెకి తీసుకున్నారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన డూప్లికేట్ ఆధార్ నెంబర్ ని ఐడీ ప్రూఫ్ గా చూపడం తో (మిగతా 2వ పేజీలో..)

## మంత్రి సీతక్క పరువు నష్టం దావా: బీఆర్‌ఎస్‌కు కోర్టు షాక్

**మన దునియా,హైదరాబాద్: మే 07**

అంగన్‌వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలుపై బీఆర్‌ఎస్ చేసిన ఆరోపణలను తప్పుడు ప్రచారంగా నిర్ధారిస్తూ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు సంచలన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ 10న బీఆర్‌ఎస్ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో పోస్టు చేసిన వివాదాస్పద ప్రచారాలను వెంటనే తొలగించాలని కోర్టు ఆదేశించింది. టెండర్ నోటిఫికేషన్ నుంచి చెల్లింపుల వివరాల వరకు అన్ని పత్రాలను పరిశీలించిన న్యాయస్థానం.. రూ.30 కోట్ల అవినీతి జరిగిందన్న బీఆర్‌ఎస్ ఆరోపణల్లో ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. ప్రభుత్వం ఒక్కో మొబైల్ ఫోన్‌ను రూ.11,650 చొప్పున మొత్తం రూ.44.42 కోట్లతో కొనుగోలు చేయగా, రూ.8,499 విలువైన ఫోన్‌ను రూ.14,499కి కొనుగోలు చేశారంటూ బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం (మిగతా 2వ పేజీలో..)




## బెంగాల్ అసెంబ్లీని రద్దు చేసిన గవర్నర్.. ఎల్లుండి కొలువుదీరనున్న బీజేపీ ప్రభుత్వం!

పశ్చిమ బెంగాల్ శాసనసభను రద్దు చేసిన గవర్నర్ ఆర్.ఎన్. రవి

ఎన్నికల తర్వాత రాజీనామాకు నిరాకరించడంతో ఏర్పడిన సంక్షోభం

ఈవీఎంల ట్యాంపరింగ్ వల్లే బీజేపీ గెలిచిందని మమత ఆరోపణ

ఎల్లుండి కొలువుదీరనున్న కొత్త బీజేపీ ప్రభుత్వం

2



## గంగుల కార్యాలయం, కౌశిక్ రెడ్డి కారుపై దాడిని ఖండించిన కేటీఆర్, హరీశ్

కరీంనగర్‌లో గంగుల కార్యాలయం వద్ద బీజేపీ కార్యకర్తల దాడి

కౌశిక్ రెడ్డికి ఫోన్ చేసిన కేటీఆర్

ప్రజాస్వామ్యంపై దాడి అన్న హరీశ్ రావు



కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడి ఉదంతం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఈ దాడిలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కారుని కూడా బీజేపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఈ ఘటనను బీఆర్‌ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీశ్ రావు తీవ్రస్థాయిలో ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి భౌతిక (మిగతా 2వ పేజీలో..)

## తమిళనాడులో 'విజయ్' సర్కార్ ఏర్పాటుపై ఉత్కంఠ..

### రంగంలోకి దిగిన వామపక్షాలు!

**మన దునియా,చెన్నై:మే 07**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ప్రభుత్వం ఏర్పాటు చేసే విషయంలో గవర్నర్ కార్యాలయం (లోక్ భవన్) తీసుకున్న నిర్ణయం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది.

లోక్‌భవన్ కీలక ప్రకటన: 'మెజారిటీ నిరూపణే ముఖ్యం'

టీవీకే అధినేత విజయ్‌తో భేటీ (మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## మంత్రి సీతక్క పరువు నష్టం దావా: బీఆర్ఎస్‌కు కోర్టు షాక్

(మొదటి పేజీ తరువాయి)

చేసిందని కోర్టు పేర్కొంది.మంత్రి సీతక్క ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఈ ఆరోపణలు చేశారన్న వాదనతో కోర్టు ఏకీభవించింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు పార్టీ సోషల్ మీడియా విభాగంపై మంత్రి సీతక్క పరువు నష్టం దావా దాఖలు చేశారు.ఈ కేసులో మంత్రి సీతక్క తరపున అడ్వకేట్ నాగులూరి కృష్ణ కుమార్ వాదనలు వినిపించారు.

## బెంగాల్ అసెంబ్లీని రద్దు చేసిన గవర్నర్.. ఎల్లుండి కొలువుదీరనున్న బీజేపీ ప్రభుత్వం!

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది. రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీని రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు నేడు (మే 7) అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో మమతా బెనర్జీ ముఖ్యమంత్రి పదవి అధికారికంగా ముగిసింది.“భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 174, క్లాజ్ 2 ప్రకారం నాకు దఖలుపడిన అధికారాలను ఉపయోగించి, పశ్చిమ బెంగాల్ శాసనసభను 2026 మే 7 నుంచి రద్దు చేస్తున్నాను” అని గవర్నర్ తన నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు.ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే, ఎన్నికల ఫలితాలను అంగీకరించని మమతా బెనర్జీ, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసేందుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం తలెత్తడంతో గవర్నర్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు.మరోవైపు, ఈ పరిణామంపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. ఎన్నికల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం) ట్యాంపరింగ్ ద్వారానే బీజేపీ గెలిచిందని ఆమె ఆరోపించారు. ఎన్నికల సంఘం కూడా బీజేపీతో కుమ్మక్కై తన ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర పన్నిందని విమర్శించారు. బీజేపీ విజయాన్ని “అనైతికం” అని ఆమె అభివర్ణించారు.గవర్నర్ నిర్ణయంతో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఎల్లుండి బీజేపీ నేతృత్వంలో నూతన ప్రభుత్వం కొలువుదీరనున్నట్టు సమాచారం.

## గంగుల కార్యాలయం, కౌశిక్ రెడ్డి కారుపై దాడిని ఖండించిన కేటీఆర్, హరీశ్

(మొదటి పేజీ తరువాయి)

దాడులకు తావులేదని, ఇది అధికార పార్టీ అండతో జరుగుతున్న దుశ్చర్య అని వారు మండిపడ్డారు.ఘటన జరిగిన వెంటనే కౌశిక్ రెడ్డికి కేటీఆర్ ఫోన్ చేసి మాట్లాడారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్న కేటీఆర్... కౌశిక్ రెడ్డితో పాటు అక్కడ ఉన్న పార్టీ కార్యకర్తల భద్రత గురించి ఆరా తీశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి (బండి సంజయ్) ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే, ఆయన అనుచరులు ఇలా బహిరంగంగా దాడులకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇది శాంతిభద్రతల వైఫల్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు.మాజీ మంత్రి హరీశ్ రావు ఈ ఘటనను ‘ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి’గా అభివర్ణించారు. ఎమ్మెల్యే కార్యాలయంపై కర్రలు, రాడ్లతో దాడి చేసిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో గూండాయిజం పెచ్చుమీరుతోందని, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం సరికాదని హరీశ్ రావు మండిపడ్డారు.


## కేటీఆర్ పై క్రిమినల్ కేసు నమోదు

### రైతు సంగ్రామ సదస్సు వేదికగా రాహుల్, రేవంత్ లపై కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు

### కేటీఆర్ వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయంటూ కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

### బీఎన్ఎస్ సెక్షన్లు 504, 505 కింద కేసు నమోదు చేసిన పోలీసులు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై వరంగల్‌లో క్రిమినల్ కేసులు నమోదు కావడం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఉత్కంఠ రేపుతోంది. హన్మకొండ ‘రైతు సంగ్రామ సదస్సు’ వేదికగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చట్టపరమైన చిక్కులకు దారితీశాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయని కాంగ్రెస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి తదితరుల ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కేటీఆర్‌పై బీఎన్ఎస్‌యాక్ట్‌లోని సెక్షన్ 504 (శాంతి భంగం కలిగించేలా ఉద్దేశపూర్వకంగా అవమానించడం), సెక్షన్ 505 (ప్రజా విద్వేషాన్ని ప్రేరేపించే ప్రకటనలు చేయడం) కింద కేసులు నమోదు చేశారు.



# తమిళనాడులో ‘విజయ్’ సర్కార్ ఏర్పాటుపై ఉత్కంఠ..

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం రాజ్ భవన్ ఒక అధికారిక ప్రెస్ నోట్ విడుదల చేసింది. ఈ భేటీలో ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన స్పష్టమైన మెజారిటీ మద్దతు ప్రస్తుతం టీవీకే వద్ద లేదని గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా అసెంబ్లీలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఉండాల్సిన సంఖ్యాబలంపై గవర్నర్.. విజయ్‌కు మార్గనిర్దేశం చేశారు. కేవలం అతిపెద్ద పార్టీగా ఉండటమే కాకుండా, సభలో తగినంత మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్నట్లు ఆధారాలు (సపోర్ట్ లెటర్స్) చూపాలని సూచించారు.

**విజయ్‌కు మద్దతుగా నిలిచిన సీపీఎం**

మరోవైపు, అతిపెద్ద పార్టీగా అవతరించిన టీవీకే అధినేత విజయ్‌కే ప్రభుత్వం ఏర్పాటు చేసే మొదటి అవకాశం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి. శణ్ముగం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో పలు కీలక అంశాలను లేవనెత్తారు. 234 స్థానాలున్న అసెంబ్లీలో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాలేదని, అయితే 108 మంది ఎమ్మెల్యేలతో టీవీకే అతిపెద్ద పార్టీగా నిలిచిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేవలం విజయ్ మాత్రమే ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ముందుకు వచ్చారని, మరే ఇతర కూటమి హక్కు కోరనప్పుడు గవర్నర్ ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. గవర్నర్ వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం గవర్నర్ వ్యవస్థను వాడుకుంటోందని సీపీఎం తీవ్రంగా ఆరోపించింది.

**పెరుగుతున్న రాజకీయ మద్దతు**

విజయ్‌కు కేవలం సీపీఎం మాత్రమే కాకుండా, ఇతర పార్టీల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. సిపిఐ,వి సి కె పార్టీలు కూడా ప్రజా తీర్పును గౌరవించి విజయ్‌కు అవకాశం ఇవ్వాలని కోరుతున్నాయి. కాంగ్రెస్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, తమిళనాడు ప్రజల తీర్పును గౌరవించాలని హితవు పలికింది.118 సీట్ల మెజారిటీ మార్కును అందుకోవడానికి టీవీకేకు ఇంకా మరో 10 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ఒకవేళ కాంగ్రెస్ (5 సీట్లు), సీపీఎం, సీపీఐ, వీసీకే వంటి పార్టీలు అధికారికంగా మద్దతు లేఖలు అందజేస్తే విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు మార్గం సుగమం అవుతుంది. అప్పటి వరకు తమిళ రాజకీయాల్లో ఈ ఉత్కంఠ కొనసాగుతూనే ఉంటుంది..

# మే 1న లాడ్జిలో రాబరీ గ్యాంగ్!!

(మొదటి పేజీ తరువాయి)

నిర్వాహకులు రూమ్ ఇచ్చారు. మొదట నలుగురు, ఆ తర్వాత మరో వ్యక్తి కలిసి బస చేయగా భోజనం ఇతరత్రా అవసరాలకు లాడ్జి సిబ్బందికి డబ్బులు ఇచ్చి పని చేయించుకున్నారు. అయితే ఎక్కడ కూడా వారి ఫోన్ నెంబర్ ఇవ్వకుండా యూపీఐ పేమెంట్స్ చేయకుండా జాగ్రత్తపడ్డారు. రెండు రాత్రులు అదే లాడ్జిలో గడిపిన నిందితులు ప్రతిరోజు మద్యం తాగేవారని రాబరీ జరిగిన రోజు ఉదయం లాడ్జి వేకెట్ చేసి వెళ్లిపోయారని నిర్వాహకులు తెలిపారు.అయితే

పీఎంజే జ్యువెలరీలో డెకాయిట్ గ్యాంగ్ దోపిడీ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

**డెకయిట్ గ్యాంగ్ టార్గెట్.. ప్రత్యేక పోలీసు టీమ్ వేట..**

దోపిడీ చేసిన నిందితులు జగిత్యాల జిల్లా ధర్మపురి లోని ఓ ప్రైవేట్ లాడ్జీలో బస చేసినట్లు పోలీసులు గుర్తించడం ఆందోళన కలిగిస్తోంది. నేరస్తులు పట్టణాల్లోని లాడ్జీలను తాత్కాలిక ఆశ్రయాలుగా ఉపయోగించుకుంటున్నారన్న అనుమానాలు బలపడుతున్నాయి. తాజా ఘటన నేపథ్యంలో అసలు లాడ్జీల నిర్వహణ నిబంధనల మేరకే నడుస్తుందా.. అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. నామ మాత్రంగా ఐడీ వెరిఫికేషన్ చేస్తూరూమ్ లు అద్దెకు ఇస్తుండడం ఆందోళన కరంగా మారింది. దోపిడీ జరిగింది కరీంనగర్ లో అయినా పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు నిందితులు ధర్మపురి లో షెల్టర్ తీసుకున్నట్లు తెలుస్తుంది. ఈ పరిణామంతో అసలు లాడ్జీలపై పోలీస్ నిఘా, తనిఖీల స్థాయి ఎంతవరకు సమర్థవంతంగా ఉందన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

**నిబంధనలు ఉన్నా అమలులో లోపాలు**

నిబంధనల ప్రకారం ప్రతి లాడ్జీలో గెస్ట్ రిజిస్టర్ తప్పనిసరిగా నిర్వహించాలి. షెల్టర్ కోసం దిగిన వారి పూర్తి వివరాలు, ఐడీ ప్రూఫ్, మొబైల్ నంబర్లు నమోదు చేయడం కచ్చితంగా అమలు కావాలి.ప్రతి లాడ్జి లో సీసీ కెమెరాలు తప్పనిసరి. అయితే వాస్తవ పరిస్థితుల్లో కొన్ని లాడ్జీల్లో ఈ ప్రక్రియ కేవలం నామమాత్రంగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే అవకాశాన్ని నేరస్తులు వినియోగించుకుని తమ ఆనవాళ్లను దాచుకునే ప్రయత్నం చేస్తున్నారు. దొంగ ఐడీలతో తప్పుడు సమాచారం ఇచ్చి రూమ్ లు తీసుకుని పని కానిచ్చి వెళ్లిపోతున్నారు. లాడ్జీల నిర్వాహకులు ఐడీ వెరిఫికేషన్ తో పాటు పూర్తి అడ్రస్ ఫోన్ నెంబర్ తదితర వివరాలు క్రాస్ చెక్ చేసుకుని రూమ్ ఇస్తే ఇలాంటి ఘటనలు జరిగే అవకాశం తక్కువ. ఒకవేళ జరిగిన పోలీస్ ఇన్వెస్టిగేషన్?లో నిందితులను పట్టుకోవడం సులభతరం అవుతుంది.

**పోలీసుల నిరంతర నిఘా అమలావుతుందా??**

మరోవైపు, రెగ్యులర్ పోలీస్ చెకింగ్ విషయంలోనూ అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో అప్పుడప్పుడు ప్రత్యేక దాడులు జరిగినప్పటికీ, నిరంతర తనిఖీలు లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లాడ్జీల్లో అనుమానాస్పద కదలికలు, అసాంఘిక కార్యకలాపాలపై పోలీస్ నిఘా మరింత కట్టుదిట్టం కావాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.కొన్ని చోట్ల అనుమతులు తీసుకుని నడిపిస్తుంటే కొండగట్టు, ధర్మపురి వంటి ఆధ్యాత్మిక ప్రాంతాల్లో అనుమతి లేని లాడ్జిలు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తున్నాయి.ఇలాంటి వాటిపై కొరడా ఝులిపించాల్సిన పోలీసు అధికారులు కూడా అంతా ‘మాములే’అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని జనంలో అనుమానాలకు తొలగిస్తుంది.

**పర్యవేక్షణ లేకపోతే ప్రమాదమే..**

ఈ ఘటన నేపథ్యంలో లాడ్జీ నిర్వాహకుల బాధ్యతపై కూడా చర్చ మొదలైంది. ప్రతి గెస్ట్ నుంచి సరైన ఐడీ తీసుకోవడం, ధృవీకరణ చేయడం, అనుమానాస్పద వ్యక్తుల వివరాలను వెంటనే పోలీసులకు అందించడం వంటి చర్యలు కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉంది. లేదంటే లాడ్జీలు నేరస్తులకు సురక్షిత స్థావరాలుగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఘటన కనీస భద్రతా ప్రమాణాల అమలుపై మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారి పట్ల ఒకటికి రెండుసార్లు క్రాస్ చెక్ చేసుకుని రూములు అద్దెకు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

## విజయ్‌ని సీఎం కాకుండా అడ్డుకోవడం అంటే ప్రజా తీర్పుని అగౌరవ పర్చడమే: కమల్ హాసన్


తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం నెలకొన్న రాజకీయ సంక్షోభంపై ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం పార్టీ అధ్యక్షుడు, ఎంపీ కమల్ హాసన్ తీవ్రంగా స్పందించారు. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ 108 స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది ప్రజా తీర్పును అగౌరవపరచడమేనని, రాష్ట్రానికి జరిగిన అవమానమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’లో సుదీర్ఘమైన పోస్ట్ పెట్టారు.

రాజ్యాంగ బాధ్యతను గుర్తు చేస్తున్నా

“తమిళనాడు శాసనసభ ఎన్నికలలో ఏ ఒక్క పార్టీకీ ప్రజలు స్పష్టమైన మెజారిటీ ఇవ్వలేదు. రాష్ట్ర చరిత్రలో ఇలాంటి ఫలితం రావడం ఇదే తొలిసారి. ‘ప్రజల తీర్పును గౌరవిస్తాం, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా ఉంటాం’ అని నా సోదరుడు ఎంకే స్టాలిన్ ప్రకటించడం ఆయన రాజకీయ పరిపక్వతకు నిదర్శనం. ఆయనను నేను గౌరవిస్తున్నాను. ఇప్పుడు రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు కూడా తమ విధిని నిర్వర్తించాలి. ఇది డిమాండ్ కాదు, వారి రాజ్యాంగపరమైన బాధ్యతను గుర్తుచేయడం మాత్రమే” అని కమల్ హాసన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

అది ప్రజాస్వామ్యానికి నష్టం

విజయ్ పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించకపోవడంపై కమల్ హాసన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. “విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ 108 స్థానాలు గెలుచుకుంది. వారిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించకపోవడం తమిళనాడు ప్రజల తీర్పును అగౌరవపరచడమే. ఎన్నికైన సభ్యులు ఇప్పటికీ ప్రమాణ స్వీకారం చేయలేకపోవడం రాష్ట్రానికి జరిగిన అవమానం, ప్రజాస్వామ్యానికి కలిగిన నష్టం” అని అన్నారు.ఈ సందర్భంగా సుప్రీంకోర్టు తీర్పును కూడా ఆయన గుర్తుచేశారు. “మెజారిటీని రాజ్‌భవన్‌లో కాదు, శాసనసభలోనే నిరూపించుకోవాలని ఎా.=. బొమ్మై కేసులో సుప్రీం కోర్టు స్పష్టంగా చెప్పింది. నేను పార్టీ రాజకీయాల గురించి మాట్లాడటం లేదు. ఒక భారతీయ పౌరుడిగా విధానపరమైన గళం వినిపిస్తున్నాను. తమిళనాడు ప్రజల తీర్పును తప్పక గౌరవించాలి” అని కమల్ హాసన్ తన పోస్ట్‌లో స్పష్టం చేశారు.



## తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి హరీష్ రావుని మర్యాదపూర్వకంగా కలిసిన జన్నారం మండల గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి మండల ప్రెసిడెంట్ మగ్గిడి తిరుపతి





**ఖానాపూర్ ఆర్సి మన దునియా ప్రతినిధి మే: 07.**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి మండల అధ్యక్షులు మగ్గిడి తిరుపతి గల్ఫ్ కార్మికుల సమస్యలను మాజీ మంత్రి హరీష్ రావు దృష్టికి తీసుకెళ్లారు. గత కొన్ని సంవత్సరాలుగా గల్ఫ్ కార్మికులకు జరుగుతున్న అన్యాయాలను ఇప్పటివరకు ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి 500 కోట్లతో ప్రత్యేక గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలని, గల్ఫ్ లో మరణించిన కార్మికుల కుటుంబాలకు 5 లక్షల ఆర్థిక సహాయం అందరికీ అందేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు భరోసాగా నిలవాలని టీ జీ డబ్ల్యు డబ్ల్యు సి జన్నారం మండల ప్రెసిడెంట్ మగ్గిడి తిరుపతి మాజీ మంత్రి హరీష్ రావు నివాసంలో ప్రత్యేకంగా కలిసి, గల్ఫ్ కార్మికుల కష్టాలు, వారి కుటుంబాలు పడుతున్న ఆవేదనను వివరించారు.గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు బిఆర్ఎస్ పార్టీ అండదండలు ఎప్పుడూ ఉంటాయని, గల్ఫ్ కార్మికులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి వారికి అండగా ఉంటామని వారు మాటిచ్చారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా రికవరీ చీఫ్ శంకర్ నాయక్ , మాజీ తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ రాంపాల్ నాయక్ , బాదావత్ శ్రీనివాస్ నాయక్ (గల్ఫ్ కార్మిక నాయకులు) తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడు ఆపద్ధర్మ ముఖ్యమంత్రి స్టాలిన్ సంచలన ప్రకటన

**మన దునియా,తమిళనాడు:మే 07**

చెన్నై: తమిళనాడు ఆపద్ధర్మ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్ సంచలన ప్రకటన చేశారు. రాష్ట్రంలో తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే ఆరు నెలల వరకూ తాము అడ్డుకోమంటూ ప్రకటించారు. తమ పార్టీ ఎలాంటి రాజ్యాంగ సంక్షోభాన్ని కోరుకోవడం లేదని ఆయన తెలిపారు. 'విజయ్‌ను ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనివ్వండి, ఎలాంటి రాజ్యాంగ సంక్షోభం మాకు వద్దు' అంటూ స్టాలిన్ పేర్కొన్నారు.డీఎంకే ప్రభుత్వం ప్రారంభించిన సంక్షేమ పథకాలను విజయ్ కొత్త ప్రభుత్వం కొనసాగిస్తుందని తాను ఆశిస్తున్నట్లు స్టాలిన్ పేర్కొన్నారు. టీవీకే తన ఎన్నికల మేనిఫెస్టోలో చేసిన కీలక హామీలనూ అమలు చేస్తుందని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీలను టీవీకే నెరవేర్చగలదా, లేదా? అనేది వేచి చూస్తామనీ అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల ఉచిత అల్పాహార పథకాన్ని కొత్త ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని విజయ్ చెప్పారని.. అయితే, ఆ హామీ అమలు చేయడం కష్టమేనని పేర్కొన్నారు. కనీసం తామిచ్చిన రూ.1000 అయినా మహిళలకు అందించాలని సూచించారు. డీఎంకే మేనిఫెస్టోలోని 90 శాతం హామీలను అమలు చేశామని.. కేంద్రం వల్లే 'నీట్' రద్దు సాధ్యం కాలేదని స్టాలిన్ చెప్పుకొచ్చారు.స్టాలిన్ తాజా ప్రకటనతో




తమిళనాడు రాజకీయాలు మరో కొత్త మలుపు తీసుకున్నాయి. బుధవారం రాత్రి వరకూ రిసార్ట్ రాజకీయాలు నడిచినట్లు ప్రచారం జరిగింది. ద్రవిడ పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకేలు ఇతర చిన్నచిన్న పార్టీలను కలుపుకుని మట్నత్తం 120 మంది ఎమ్మెల్యేలతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయని జోరుగా ప్రచారం జరిగింది. స్టాలిన్ తాజా ప్రకటనతో ఆ ఊహాగానాలకు చెక్ పడినట్లు అయ్యింది.

# ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కారుపై బీజేపీ నేతల దాడి..

**కరీంనగర్‌లో ఉద్రిక్తత**

**మన దునియా,కరీంనగర్,మే 07**

ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై బీజేపీ నేతలు దాడి చేశారు. అలాగే ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారుపై దాడి చేయడంతో అద్దాలు ధ్వంసమయ్యాయి. దీంతో కరీంనగర్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసన బీజేపీ నేతలు దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది.ఈరోజు(గురువారం) ఉదయం కరీంనగర్‌లోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రెస్‌మీట్ నిర్వహించి.. కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై పలు వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందంటూ ఆరోపణలు గుప్పించారు. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై బండి సంజయ్ అనుచరులు, బీజేపీ కార్యకర్తలు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. కౌశిక్ రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టిన కమలాకర్ క్యాంపు కార్యాలయంపై దాడి చేశారు. బీజేపీ శ్రేణుల దాడిలో కార్యాలయం అద్దాలు, పూల కుండీలు ధ్వంసమయ్యాయి. అక్కడే ఉన్న కౌశిక్ రెడ్డి కారుపై దాడి చేసి అద్దాలను పూర్తిగా ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు.. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్నారు. బీజేపీ శ్రేణులను చెదరగొట్టారు. పలువురిని అదుపులోకి తీసుకున్నారు. బీజేపీ నేతల దాడులతో కరీంనగర్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కరీంనగర్ నుంచి జగిత్యాలకు వెళ్లే జాతీయ రహదారిని మూసివేసిన పోలీసులు.. వేరే మార్గంలో వాహనాలను మళ్లిస్తున్నారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు.

సిరిసిల్లలో హైటెన్షన్..

మరోవైపు సిరిసిల్లలో బండి సంజయ్ పర్యటనపై హైటెన్షన్ నెలకొంది. కేటీఆర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలకు నిరసనగా బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగారు. కేంద్ర మంత్రి పర్యటనను అడ్డుకునేందుకు గులాబీ శ్రేణులు సిద్ధమయ్యారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు.. పలువురు బీఆర్ఎస్ శ్రేణులను ముందుస్తుగా అరెస్ట్ చేశారు. భారీగా పోలీసులు మోహరించారు..




## టీవీకే పార్టీ అధినేత విజయ్, సర్కార్ ఏర్పాటుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్!?

**మన దునియా,హైదరాబాద్:మే 07**



తమిళనాడులో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సంబంధించి నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు టీవీకే అధినేత విజయ్‌కు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇవాళ లోక్‌భవన్‌లో గవర్నర్‌తో రెండోసారి భేటీ అయిన విజయ్.. ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతివ్వాలని.. అసెంబ్లీలో బలం నిరూపించుకుంటానని చెప్పారు. 112 మంది ఎమ్మెల్యే లతో ప్రభుత్వాన్ని ఎలా ఏర్పాటు చేయగలరు? ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత మెజా రిటీని ఎలా నిరూపిం చుకోగలరు అని విజయ్ ని గవర్నర్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది,దాదాపు గంటకు పైగా సాగిన ఈ భేటీలో గవర్నర్ పలు కీలక ప్రశ్నలను విజయ్ ముందు ఉంచినట్లు సమాచా రం. సభలో ప్రభుత్వ ఏర్పా టుకు 118 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం కాగా, ప్రస్తుతం టీవీకేకు ఉన్న 112 మందితో పరిపా లన ఎలా సాగిస్తారు?, మెజారిటీకి కావాల్సిన మిగిలిన ఎమ్మెల్యేల మద్దతు ఏ పార్టీల నుండి వస్తుంది? ఇతర పార్టీలు మద్దతు ఇవ్వడానికి అంగీకరిం చాయా? వంటి ప్రశ్నల ను గవర్నర్ విజయ్ ముందుంచారు. అయి తే ప్రమాణస్వీకారం తర్వాత అసెంబ్లీలో బలం నిరూపించు కుంటానని విజయ్ చెప్పడంతో గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.గవర్నర్ అనుమతివ్వ డంతో విజయ్ ప్రమా ణస్వీకారానికి ఏర్పాట్లు జరుగుతు న్నాయి. ఒకవేళ గవర్నర్ తన అభ్యర్థ నను తిరస్కరిస్తే, ఊరికే కూర్చోకుండా చట్టపరమైన మార్గాల నుఅనుసరించడానికి కూడా టీవీకే సిద్ధమైం దని పార్టీ వర్గాల సమాచారం. ఇప్పటికే టీవీకే పార్టీకి కాంగ్రెస్ మద్దతు ప్రకటించగా.. ఇతర పార్టీల మద్ధతు కోసం విజయ్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

## ఈ నెల 13 నుంచి ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు!

**మన దునియా,హైదరాబాద్:మే 07**



తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు ఈనెల 13 నుంచి 21 వరకు జరగనున్నాయి హాల్ టికెట్లను ఇంటర్ బోర్డు అధికారులు గురువారం రిలీజ్ చేయనున్నారు. తొలుత కాలేజీల లాగిన్ లో పెట్టి రెండు రోజులకు స్టూడెంట్ల వాట్సాప్ లకు పంపించనున్నారు. విద్యార్థులు రిజిస్ట్రేష న్ నెంబర్ తో హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసు కోవచ్చని అధికారులు సూచించారు. అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు కోసం మొత్తం 3,97,997 మంది విద్యార్థులు ఫీజులు చెల్లించారు. ఒకేషనల్ విభాగంలో 28,703 మంది విద్యార్థులు ఫీజులు చెల్లించారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు అన్ని ఏర్పాట్లు చేస్తుంది. ఇప్పటికే పరీక్షలకు సంబంధిం చిన షెడ్యూల్ కూడా విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు మే 13 నుంచి మే 21 వరకు ప్రతి రోజూ రెండు సెషన్లలో జరగనున్నాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యా హ్నం 12 గంటల వరకు, సెకండ్ ఇయర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్నాయి.

## శివాజీ యూత్ ఆధ్వర్యంలో 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేత.!!

**ఖానాపూర్ ఆర్సి మన దునియా ప్రతినిధి మే:07.**

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కవ్వాల్ గ్రామంలో శివాజీ యూత్ సభ్యులు తమ ఉదారతను చాటుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో స్వర్గస్తులైన గ్రామానికి చెందిన రంగు రాజన్న కుటుంబాన్ని శివాజీ యూత్ సభ్యులు పరామర్శించారు. గత 5 రోజులు క్రితం మరణించిన రంగు రాజన్న కుటుంబానికి అండగా నిలుస్తూ ఈరోజు నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమంలో శివాజీ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో రూ.5001/- నగదు సాయంతో పాటు 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. గ్రామంలో ఎ కుటుంబానికి కష్టం వచ్చినా తమ వంతు సహాయం అందించడానికి ఎల్లప్పుడూ ముందుంటామని రాజన్న మృతి ఆ కుటుంబానికి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు.రాజన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కష్టకాలంలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన యువకులకు చొరవను గ్రామస్తులు మరియు స్థానిక నాయకులు అభినందించారు. తోటి వారికి సహాయం చేయడంలో యువత చూపుతున్న ఈ ఉత్సాహం అందరికీ ఆదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శివాజీ యూత్ సభ్యులు మరియు గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# విజయ్ సర్కార్‌పై ఉత్కంఠ.. నటుడు విశాల్ ఆసక్తికర ట్వీట్

**మన దునియా,తమిళనాడు,చెన్నై,మే07**




ప్రస్తుతం తమిళనాడులో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై నటుడు విశాల్ స్పందిస్తూ సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అయ్యాయి. విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు గవర్నర్ ఎందుకు అవకాశం ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. 2017-18లో గోవా, మణిపూర్, మేఘాలయ, కర్ణాటకలో జరిగిన పరిణామాలను విశాల్ గుర్తు చేశారు. అప్పట్లో ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇచ్చి, తర్వాత అసెంబ్లీలో ఫ్లోర్ టెస్ట్ నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఇప్పుడు తమిళనాడులో కూడా టీవీకే అధినేత విజయ్‌కు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలని విశాల్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం తమిళనాడులో 233 మంది ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేయాల్సి ఉందని, ఇలాంటి సమయంలో గవర్నర్ పాలన కాదని, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమే కావాలని విశాల్ ట్వీట్‌లో పేర్కొన్నారు. టీవీకే పార్టీకి దాదాపు మెజారిటీ వచ్చినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వడంలో గవర్నర్ ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని విశాల్ ప్రశ్నించారు. ప్రజల తీర్పుకు గౌరవం ఎక్కడ? అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ హక్కులు రాజకీయ నాయకులకు మాత్రమే కాదని, ప్రజలకు కూడా తెలుసని విశాల్ అన్నారు. విజయ్ తప్పకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తారని, తాను కూడా అదే కోరుకుంటున్నానంటూ విశాల్ తన మద్దతు ప్రకటించారు..

# ధాన్యం రవాణాపై రవాణా శాఖ కీలక ఆదేశాలు

**మన దునియా,హైదరాబాద్:మే 07**

ధాన్యం రవాణాపై తెలంగాణ రవాణా శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. వరి ధాన్యం తరలింపునకు వాహనాలను సమీకరించాలని ఆదేశించింది. ఈ మేరకు జిల్లా రవాణా అధికారులకు ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వేగంగా ధాన్యం రవాణాకు చర్యలు చేపట్టాలని సూచించారు. సరిపడా గూడ్స్ వాహనాలు అందుబాటులో ఉంచాలని దిశానిర్దేశం చేశారు. అన్ని వాహనాలకు ఆర్సీ, ఫిట్‌నెస్, పర్మిట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ చెల్లుబాటు పత్రాలు తప్పనిసరిగా చేయాలని మార్గనిర్దేశం చేశారు. కలెక్టర్లు, సివిల్ సప్లైస్‌తో సమన్వయం చేయాలని ఆదేశించారు. ధాన్యం రవాణాలో ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సూచించారు..

# కేటీఆర్‌ను విమర్శించే స్థాయి బండి సంజయ్‌కి లేదు: ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి




**మన దునియా,కరీంనగర్:మే 07**

కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. బండి సంజయ్, సీఎం రేవంత్ రెడ్డి మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని ఆరోపించారు. రేవంత్ ఏది మాట్లాడితే.. బండి సంజయ్ అదే మాట్లాడుతున్నారని తెలిపారు. బండి సంజయ్ తిట్టాల్సింది కేటీఆర్‌నా .. రేవంత్ రెడ్డినా అని ప్రశ్నించారు. బంగారం షాపులో దొంగతనం జరిగితే ప్రభుత్వానికి బాధ్యత లేదా అని నిలదీశారు. రేవంత్‌ను సంజయ్ ఒక్క మాట కూడా ఎందుకు అనడం లేదని అన్నారు.భార్య పుస్తెలు అమ్మి పోటీ చేసిన బండి సంజయ్‌కు కోట్ల రూపాయలు ఎక్కడివని ఎమ్మెల్యే ప్రశ్నించారు. బండి సంజయ్‌కు రేవంత్ రెడ్డి డబ్బులు పంపిస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్‌ను విమర్శించే స్థాయి కేంద్ర మంత్రికి లేదన్నారు. బండి సంజయ్‌కు దమ్ముంటే కేటీఆర్‌తో చర్చకు రావాలని సవాల్ విసిరారు. కేటీఆర్‌ను ఇష్టం వచ్చినట్టు తిడితే ఊరుకునేది లేదన్నారు. బండి సంజయ్‌ను కూడా తాము తిట్టగలమని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించారు..

# విజయ్ ప్రమాణ స్వీకారం క్యాన్సిల్.. స్టేడియం వద్ద కన్నీళ్లు పెట్టుకున్న మద్దతుదారులు

**మన దునియా,చెన్నై,మే 07**

కోలీవుడ్ స్టార్ హీరో, టీవీకే పార్టీ అధినేత విజయ్ ఈ రోజు (గురువారం) ఉదయం 11.30 గంటలకు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉండింది. చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ఇందుకోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే, మెజార్టీ లేని కారణంగా.. టీవీకే పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి గవర్నర్ నిరాకరించారు. దీంతో గురువారం ఉదయం జరగాల్సిన విజయ్ ప్రమాణ స్వీకార కార్యక్రమం క్యాన్సిల్ అయింది. ఈ విషయం తెలియని విజయ్ మద్దతుదారులు రాష్ట్రం నలుమూలల నుంచి స్టేడియం దగ్గరకు పెద్ద సంఖ్యలో వచ్చేశారు. విజయ్ ప్రమాణ స్వీకార కార్యక్రమం క్యాన్సిల్ అయిందని తెలిసి షాక్ అయ్యారు. బాధతో కన్నీళ్లు పెట్టుకున్నారు. ఓ మహిళ మీడియాతో మాట్లాడుతూ.. 'విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తాడని ఎంతో సంతోషంగా ఇక్కడికి వచ్చాము. కానీ, ఇక్కడ ఏమీ లేదు. గేట్లు మూసి ఉన్నాయి. మాకు చాలా బాధగా ఉంది' అంటూ కన్నీళ్లు పెట్టుకుంది. మరికొంతమంది మద్దతుదారులు మాట్లాడుతూ.. మీడియా, సోషల్ మీడియా వార్తల కారణంగానే తాము గురువారం తెల్లవారుజామునే స్టేడియం దగ్గరకు వచ్చామన్నారు. కార్యక్రమం క్యాన్సిల్ చేస్తున్నట్లు తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు.

కారణం ఇదే..




తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 సీట్లు సాధించింది. టీవీకే పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 118 సీట్లు కావాలి. ముందు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తర్వాత బల నిరూపణకు వెళదామని విజయ్ భావించారు. నిన్న (బుధవారం) గవర్నర్ అర్లేకర్‌ను కలిశారు. అయితే, మెజార్టీ లేకపోవటంతో ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ నిరాకరించారు. దీంతో ఈ రోజు జరగాల్సిన విజయ్ ప్రమాణ స్వీకారం కార్యక్రమం క్యాన్సిల్ అయింది..

# జన గణన అవగాహన కార్యక్రమం 2027





**మన దునియా,జోగులాంబ గద్వాల జిల్లా:మే 07**

జన గణన అనేది దేశ అభివృద్ధికి ఎంతో ముఖ్యమైన ప్రక్రియ. ప్రజల సంఖ్య విద్య ఉపాధి నివాస పరిస్థితి వంటి వివరాలను సేకరించడం ద్వారా ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు సమర్థవంతంగా అమలు చేయగలరు. ఈ లక్ష్యంతో 2027 జనగణన అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు జనగణన యొక్క ప్రాముఖ్యతను వివరించేందుకు ఈ యొక్క ర్యాలీ ముఖ్య ఉద్దేశం. ప్రతి కుటుంబం సరైన సమాచారాన్ని అందించడం వల్ల ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరుతాయని తెలియజేశారు. జనగణ సమయంలో ప్రజలు సహకరించాల్సిన విధానాన్ని ఇంటింటికి వచ్చే సిబ్బందికి సరైన సమాచారం ఇవ్వాలని అలాగే జనగణన ద్వారా దేశాభివృద్ధికి ప్రతిపరుడు భాగస్వామి కావాలని చెప్పారు. గద్వాల పట్టణంలో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఇట్టి కార్యక్రమంలో రెవిన్యూ డిప్యూటీ తాసిల్దార్ అజిత్ కుమార్, అలాగే పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు, విద్యాశాఖ ఉద్యోగులు రేషన్ డీలర్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు జాప్యంపై నల్లబెల్లి రైతుల రాస్తారోకో





## ఎం సి పి ఐ యు ఆధ్వర్యంలో రోడ్డు మీద పంట తగలబెట్టి నిరసన

**మన దునియా, వరంగల్ జిల్లా,నల్లబెల్లి:మే 07**

నల్లబెల్లి: మొక్కజొన్న పంటను కొనుగోలు చేయకపోవడంతో,నెల రోజులుగా వందలాది లారీలు, ట్రాక్టర్లతో రోడ్డు మీద నిరీక్షిస్తున్న నల్లబెల్లి మండల రైతులు నేడు ఎం సి పి ఐ యు మండల కమిటీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. మార్కెట్ యార్డు వద్ద కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో విసిగిపోయిన రైతులు, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రోడ్డుపై మొక్కజొన్నను తగలబెట్టి, పారబోసి తమ ఆగ్రహాన్ని, ఆవేదనను వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నల్లబెల్లి మండల రైతులు పాల్గొన్నారు.మండల కార్యదర్శి కా. దామ సాంబయ్య, మండల సహాయ కార్యదర్శి మార్త నాగరాజు మాట్లాడుతూ, "రైతు నాలుగు నెలలు చెమట చిందించి పండించిన మొక్కజొన్నను అమ్ముకునే దిక్కులేక రోడ్డు మీద తగలబెట్టుకునే దుస్థితి దాపురించింది. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తక్షణమే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలి. మక్కాలో దిగుమతి చేసుకొని రైతులను ఆదుకోవాలి. కల్లాలలో ఉన్న మొక్కలను కూడా ఎలాంటి షరతులు, జాప్యం లేకుండా కొనుగోలు చేయాలి. పండించిన మొక్కజొన్నను సకాలంలో కొనుగోలు చేయకపోతే రైతులందరం కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతాం. కలెక్టర్ ఆఫీస్ ముట్టడిస్తాం. బారులు తీరిన వాహనాలను చూసైనా ప్రభుత్వం కళ్ళు తెరవాలి. ఇప్పటికే రైతు వడ్డీల భారంతో, పెట్టుబడి నష్టంతో కుంగిపోయి ఉన్నాడు" అని హెచ్చరించారు.రైతుల ఆందోళన ఉధృతం కావడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎమ్మార్వో గారు రైతులతో చర్చించి, రేపటి నుండే నల్లబెల్లి మార్కెట్ యార్డ్‌లో కొనుగోలు ప్రక్రియను ప్రారంభిస్తామని, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. లేకుంటే కొనుగోలు చేయకుంటే పెద్ద ఎత్తున రైతులందరూ కలిసి కలెక్టర్ ఆఫీస్ ముట్టడిస్తామని ఎం సి పి ఐ యు పార్టీ ఆధ్వర్యంలో హెచ్చరించడం జరిగింది ఈ కార్యక్రమంలో నల్లబెల్లి మండల రైతులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం
మే । శుక్రవారం । 8 । 2026



# జూబ్లీహిల్స్ 'రిచ్ కిడ్స్' ట్రాప్ కేసు.. రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన నిజాలు

**మన దునియా,హైదరాబాద్:మే 07**

హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన జూబ్లీహిల్స్ ఇన్‌స్టాగ్రామ్ ట్రాప్ కేసులో పోలీసులు సంచలన విషయాలను వెలుగులోకి తీసుకువచ్చారు. రిచ్ కిడ్స్‌ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియా ద్వారా మైనర్ బాలికలను ట్రాప్ చేసిన ఈ కేసులో మొత్తం 11 మందిని నిందితులుగా చేర్చినట్లు సమాచారం. కేసుకు సంబంధించిన రిమాండ్ కాపీలో అనేక సంచలన అంశాలు బయటపడగా, మైనర్లను బ్లాక్‌మెయిల్ చేసి లక్షల రూపాయలు వసూలు చేసిన భారీ నెట్‌వర్క్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ రిమాండ్ రిపోర్ట్ ఏబీఎన్ ఆంధ్రజ్యోతికి చిక్కింది. అందులో ఏముందంటే..పోలీసుల దర్యాప్తు ప్రకారం.. ప్రధాన నిందితుడు అర్జున్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బాలికతో పరిచయం పెంచుకున్నాడు. మొదట స్నేహంగా ప్రారంభమైన పరిచయం తర్వాత బలవంతపు సంబంధాలకు దారితీసినట్లు పోలీసులు గుర్తించారు. అర్జున్‌తో పాటు రాజీవ్, వారి స్నేహితుల పాత్ర కూడా ఈ కేసులో ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. బాధితురాలి కుటుంబ సభ్యులు పలుమార్లు అర్జున్‌ను హెచ్చరించినప్పటికీ అతను తన ప్రవర్తన మార్చుకోలేదని సమాచారం. గత ఏడాదిలోనే అర్జున్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రిమాండ్ రిపోర్టులో ప్రస్తావించారు.

**అరెస్ట్ అయినా మారని అర్జున్..**

అర్జున్ గతంలోనే పోక్సో కేసులో అరెస్ట్ అయ్యి బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయితే జైలు నుంచి విడుదలైన తర్వాత కూడా అతను బాలికతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తిరిగి కనెక్ట్ అయ్యాడు. దీంతో కేసు మరింత తీవ్రమైంది. బాలిక కుటుంబం అర్జున్‌తో మాట్లాడొద్దని హెచ్చరించినా, ఇంట్లో పని చేసే సరస్వతి అనే మహిళ ఫోన్‌ను వినియోగించి బాలిక అతనితో మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు.

**పనిమనిషి బ్లాక్‌మెయిల్..**

ఈ కేసులో మరో కీలక పాత్రగా పనిమనిషి సరస్వతి పేరు బయటపడింది. మైనర్ బాలిక పరిస్థితిని ఆసరాగా తీసుకుని ఆమెను బ్లాక్‌మెయిల్ చేస్తూ రూ.9 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. అర్జున్‌తో సంబంధాల విషయం బయటపెడతానంటూ బాలికను.. పనిమనిషి బెదిరించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ఆమె పాత్రపై పోలీసులు ప్రత్యేకంగా దర్యాప్తు చేస్తున్నారు.

**మూడు నెలల్లో రూ.13 లక్షలు..**

ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు పలు సందర్భాల్లో అర్జున్ బాలికపై లైంగిక దాడులకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. అదే సమయంలో వివిధ అవసరాలు, సమస్యలు అంటూ బాధితురాలి నుంచి సుమారు రూ.13 లక్షలు తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అర్జున్ అడిగిన డబ్బులు ఇవ్వడానికి బాలిక ఇంట్లోనే దొంగతనానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. తన తండ్రికి తెలియకుండా ఇంట్లోని కప్‌బోర్డ్ నుంచి లక్షల రూపాయలు తీసుకుని అర్జున్‌కు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు.

**డబ్బులు కనిపించకపోవడంతో..**

ఇంట్లో పెద్ద మొత్తంలో డబ్బులు కనిపించకపోవడంతో బాలిక తండ్రికి




అనుమానం వచ్చింది. డబ్బుల గురించి నిలదీయగా మొదట బాలిక సమాధానం చెప్పలేకపోయింది. తర్వాత అసలు విషయం బయటపడటంతో కుటుంబ సభ్యులు షాక్‌కు గురయ్యారు. ఆ తర్వాత వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ కేసు వెలుగులోకి వచ్చింది. పోలీసులు వెంటనే విచారణ ప్రారంభించి పలు కీలక ఆధారాలు సేకరించారు.

**అర్జున్ తల్లి అకౌంట్లలో డబ్బుల లావాదేవీలు..**

ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు అర్జున్ తల్లి మీనాకుమారి బ్యాంక్ ఖాతాలను పరిశీలించారు. బాధితురాలి నుంచి ఆమె ఖాతాలకు డబ్బులు జమ అయినట్లు గుర్తించారు. దీంతో ఈ వ్యవహారంలో కుటుంబ సభ్యుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డబ్బుల ట్రాన్సాక్షన్లపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఎవరెవరు ఈ వ్యవహారంలో భాగస్వాములయ్యారనే విషయంపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు.

**మరో బాధితురాలి ఫిర్యాదు..**

ఈ కేసులో బాలికతో పాటు మరో యువతి కూడా అర్జున్‌పై ఫిర్యాదు చేసింది. దీంతో కేసు మరింత కీలకంగా మారింది. సోషల్ మీడియా ద్వారా యువతులను లక్ష్యంగా చేసుకుని మోసం చేస్తున్న గ్యాంగ్‌పై పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

**నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు కేసు బదిలీ..**

మొదట జూబ్లీహిల్స్ పరిధిలో నమోదైన ఈ కేసును తర్వాత నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలిస్తున్న పోలీసులు, త్వరలో మరికొందరిని అదుపులోకి తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

**సోషల్ మీడియా మోసాలపై హెచ్చరిక..**

ఈ ఘటన నేపథ్యంలో పోలీసులు తల్లిదండ్రులకు కీలక సూచనలు చేశారు. పిల్లలు సోషల్ మీడియాలో ఎవరితో మాట్లాడుతున్నారు?, ఎలాంటి అకౌంట్లను ఫాలో అవుతున్నారు? అనే విషయాలపై పర్యవేక్షణ అవసరమని సూచిస్తున్నారు. అపరిచితులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని, బ్లాక్‌మెయిల్‌కు గురైతే వెంటనే కుటుంబ సభ్యులకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు చెబుతున్నారు..


# ప్రసన్నాంజనేయ స్వామి వారికి ఘనంగా అర్చన.







**మన దునియా,హనుమకొండ:మే 07**



గురువారము రోజున ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం పద్మాక్షి రోడ్ హనుమకొండ నందు స్వామివారికి ఉదయము పంచామృత అభిషేకము అలంకరణ అర్చనలు దేవాలయ అర్చకులు ఆరుట్ల రామాచార్యులు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించినారు బ్రహ్మోత్సవాల 6రోజు సుందరకాండ సహిత సుదర్శన మహాయాగం హోమము ఘనంగా జరిపించడమైనది ఇది కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు గందె కృష్ణ భాగ్యలక్ష్మి దంపతులు ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్ ఉమాదేవి దంపతులు అంబటి నరేందర్ అరుణ దంపతులు కరు దశరథ లలిత దంపతులు గండ్రతి సుధాకర్




సదానందం గోపుఅనిల్ సాయి 40 మంది దంపతులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు కార్యక్రమ అనంతరము బిక్ష ఏర్పాట్లు చేయనిది దాదాపు 500 మందికి హనుమాన్ స్వాములకు బిక్ష ఏర్పాటు చేసినాము ఈ కార్యక్రమంలో స్వాములు భక్తులు పాల్గొన్నారు

## ఏసీబీ వలలో చిక్కిన అటవీ శాఖ అధికారులు!

**మన దునియా,భద్రాది జిల్లా: మే07**




భద్రాచలం అటవీ శాఖ ఎఫ్ డి వో , సుజాత, చర్ల ఇన్చార్జి డిఆర్వో, కృష్ణయ్య, గురువారం ఏసీబీ వలకు చిక్కా రు. దీంతో భద్రాచలం అటవీ శాఖలో అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. బాధితుల నుండి రూ.3.5 లక్షల లంచం తీసుకుంటుండగా భద్రాచలం ఎఫ్‌డీవో సుజాత, చర్ల ఇంచార్జ్ డీఆర్‌వో కృష్ణయ్యల ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టు కున్నారు. ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ ఆధ్వర్యంలోఈ దాడు లు నిర్వహించారు.తెలిసిన సమాచారం ప్రకారం... భద్రాది జిల్లా,చర్ల మండలం పూసుగుప్ప ప్రాంతం లో రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. ఆపనుల్లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొన్ని చెట్లను తొలగించారు. దానిపై కేసు నమోదు చేయ కుండా ఉండేందుకు భద్రాచలం ఎఫ్ డివో సుజాత, 10 లక్షల రూపాయలు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం బాధితుడీ నుండి మొదటి విడుత గా 3.5 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ బీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో పోలీసు లు ఆమెతో పాటు చర్ల అటవీ శాఖ ఇన్చార్జి అధికారి కృష్ణయ్యను అదుపులోకి తీసుకున్నారు.

## ఇండ్ల గణనప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హెల్లికేరి

**మన దునియా, వాజేడు, మే 7**




జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర సంచారకులు భారతి హెల్లికేరి అన్నారు గురువారం హైదరాబాదు నుండి తెలంగాణ రాష్ట్ర సంచాలకులు భారతి హెల్లికేరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు అదనపు కలెక్టర్లు మున్సిపల్ కమిషనర్ ముఖ్య ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా రాష్ట్ర సంచాలకులు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు నిర్వహించే ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు అన్ని స్థాయిలలో ఎన్యుమరేటర్లు సూపర్వైజర్లకు శిక్షణ పూర్తి చేయాలని 10 తేదీలోగా ఎన్యుమరేటర్లు సూపర్వైజర్లకు మెటీరియల్ కిట్లు గుర్తింపు కార్డులు అందజేయాలని తెలిపారు స్వీయ గణనపై ప్రత్యేక కార్యక్రమాలు చేయాలని ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు ఇండ్ల గణన శిక్షణకు బ్యాచ్ హాజరు ఎం ఎం ఎస్ పోర్టల్ లో వివరాలు నమోదు చేయాలని తెలిపారు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ కాల్ నుండి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అదనపు కలెక్టర్ రెవిన్యూ పీహెచ్ మహేందర్ జి తో కలిసి హాజరయ్యారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఇండ్ల ఘనంగా ప్రక్రియ కొరకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని తెలిపారు అన్న ప్రక్రియలో విధులు నిర్వహించే వారికి అన్ని స్థాయిలలో శిక్షణ పూర్తి చేయడం జరిగి?ందని స్వీయ గణనను చేసుకునేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ప్రజలందరికీ తెలిసే విధంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు స్వయం సహాయక సంఘాల మహిళలకు స్వీయ గణనపై అవగాహన కల్పించి లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో సిపిఓ ప్రకాష్ ఎస్ఓ లాల్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## సైబర్ క్రైమ్ అవేర్నెస్ కోసం కృష్ణాపురం గ్రామపంచాయతీలో అవగాహన కల్పిస్తున్న పేరూరు

**ఇన్చార్జ్ ఎస్ ఐ తిరుపతిరెడ్డి**

**మన దునియా, వాజేడు, మే 7**

సైబర్ క్రైమ్ బారిన పడితే వెంటనే స్పందించండి హెల్ప్ లైన్ నెంబర్ 1930 నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయండి లేదా స్థానిక పోలీస్ స్టేషన్ లో కూడా ఫిర్యాదు చేయవచ్చు దీనివల్ల పాస్వర్డ్ తెలిసినా ఓటీపీ లేకుండా ఎవరు లాగిన్ కాలేరు మీ ఫోన్ మరియు కంప్యూటర్లో ఆపరేటింగ్ సిస్టంను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ఉండాలా పబ్లిక్ వైఫై రైల్వేస్టేషన్లో ఉండే ఉచిత వైఫై ని ఉపయోగించి బ్యాంకింగ్ లావాదేయాలు చేయకపోవడం మంచిది. ఒకవేళ మీరు సైబర్ క్రైమ్ బారిన పడితే వెంటనే స్పందించి ఒక గంట సమయంలోనే స్థానిక పోలీస్ స్టేషన్ లోని కంప్లైంట్ చేసినట్లయితే దానిపై యాక్షన్ అది తొందరగా తీసుకోవటం జరుగుతుందని ఎస్సై తిరుపతిరెడ్డి అన్నారు సైబర్ క్రైమ్ నుండి రక్షణ పొందాలంటే బలమైన పాస్వర్డు మీ అకౌంట్లోకి సులభంగా ఊహించలేని విధంగా అక్షరాలు అంకెలు గుర్తులు కలిపి పాస్వర్డ్ సెట్ చేసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు నకిలీ మెయిల్స్ లేదా మెసేజ్ ల ద్వారా వినియోగదారుల వ్యక్తిగత దూరాలను పాస్వర్డ్లను క్రెడిట్ కార్డు నెంబర్లను కంప్యూటర్ లోకి వైరస్ పంపి వారు నాశనం చేయడం లేదా సమాచారాన్ని చోరీ చేయడం అనుమతి లేకుండా ఇతరుల కంప్యూటర్ సిస్టం లేదా అకౌంట్లోకి ప్రవేశించారు ఇలాంటివి జరిగినప్పుడు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకొని జాగ్రత్తగా ఉండాలని పేరూరు ఇన్చార్జి ఎస్ఐ తిరుపతిరెడ్డి వారి బృందంతో అవగాహన కల్పించారు



మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

## ఏసీబీ వలలో అటవీశాఖ అధికారులు




**మన దునియా, వాజేడు, మే 7**

లంచం తీసుకుంటూ భద్రాచలం అటవీ శాఖ ఎఫ్ డి ఓ  సుజాత చర్ల ఇన్చార్జి డిఆర్ఓ కృష్ణయ్య ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండగా చిక్కిన ఘటన కలకలం రేపుతుంది రోడ్డు పనులు సందర్భంగా చెట్లు దెబ్బతిన్న కేసులు చర్యలు తీసుకోకుండా ఉండేందుకు 10 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి ఇందులో భాగంగా 3 లక్షల 50 వేలు లంచం తీసుకుంటూ గా ఏసీబీ డీఎస్పీ వై రమేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి ఇద్దరిని పట్టుకున్నారు అటవీ శాఖలో అవినీతి పెరుగుతుందని స్థానికులు ఆందోళనల వ్యక్తం చేశారు ఘటనపై ఏసీబీ అధికారులు మరింత దర్యాప్తు కొనసాగిస్తున్నారు ఈ ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది

## గ్రామాల అభివృద్ధిలో ఎంపీడీవోల పాత్ర కీలకం, క్షేత్రస్థాయిలో నిత్యం తనిఖీలు నిర్వహించాలి,

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్,**

**మన దునియా,మహబూబాబాద్: మే 07**



మహబూబాబాద్ ::గ్రామాల అభివృద్ధిలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారుల పాత్ర కీలకం అని, ప్రతిరోజు క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సానిటేషన్, త్రాగునీరు సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాల అమలు, పెన్షన్ పరిశీలన ఆమోదం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతి, ఓవర్ వాటర్ హెడ్ ట్యాంకర్, పరిశుభ్రత, మిషన్ భగీరథ నీరు సరఫరా, తదితర ప్రతి విభాగానికి సంబంధించిన పనులలో గ్రామపంచాయతీ కార్యదర్శులను భాగస్వామ్యులను చేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవోలకు సూచించారు, పేదవాడి సొంత ఇంటి కల సహకారం  చేయడం కోసం ప్రభుత్వం కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరును నిబంధన ప్రకారం కమిటీల ద్వారా మంజూరు చేసి అందించాలని ఇప్పటికే మంజూరు చేసిన వాటి వివరాలను ఆన్లైన్లో నమోదు చేస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు,మిషన్ భగీరథ ద్వారా స్వచ్ఛమైన నీరును అందిస్తూ ఇతర నీటి వనరులను ఏర్పరుచుకోవాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు, గ్రామస్థాయిలో ఉన్న ప్రతి ఓవర్ హెడ్ ట్యాంకులు క్లీన్ చేపిస్తూ ఉండాలని, శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు, గ్రామస్థాయిలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని, లేబర్ టర్నోవర్ పెంచాలని తెలిపారు, అంతర్గత రోడ్ల, అభివృద్ధి పనులు పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, తదితర సదుపాయాలను ప్రజలకు అందిస్తూ పచ్చదనం పరిశుభ్రత పాటించాలని తడి చెత్త పొడి చెత్త వేరు చేసే విధంగా ప్రతిరోజు ఉదయం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు,గ్రామాలు, పట్టణాల అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకంగా ఉండాలని, అందుకు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు,ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో, (హౌసింగ్ పీడీ) పురుషోత్తం, అన్ని మండలాల ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## టేకు కలప అక్రమ రవాణా నిందితుడికి రిమాండ్

**ఖానాపూర్ ఆర్సి మన దునియా ప్రతినిధి మే; 07.**




మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో కారు లో టేకు దుంగలను అక్రమ రవాణా చేస్తూ ఇంట్లో నిలువ ఉంచిన కేసులో నిందితుడు లావుడ్య హరికృష్ణను అరెస్టు చేసి లక్షట్టిపేట్ న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. అక్రమ కలప తరలింపు పై విచారణ జరిపినట్లు ఇంధన్ పల్లి ఎఫ్ ఆర్ ఓ లక్ష్మీనారాయణ తెలిపారు. అటవీ ప్రాంతంలో ఈ సి ఓ సెన్సిటివ్ జోన్  లో ఇసుక  రవాణా చేసే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు, అదేవిధంగా కలప అక్రమ రవాణా చేసేవారి పైన ,వన్యప్రాణుల ను వేటాడే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కలప,ఇసుక అక్రమ రవాణా గురించి సమాచారం అందించాలి

## నిరుద్యోగులకు నిర్లక్ష్యం చేయకుండా ఉద్యోగాలకై నోటిఫికేషను వేయాలి ములుగు జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

**మన దునియా, వాజేడు ,మే 7**



ఈ కార్యక్రమంలో ఆనగంటి వెంకటేష్ డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులన్నీటికి నోటిఫికేషన్ వెయ్యాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డివైఎఫ్ఐ) ములుగు జిల్లా కమిటీ సమావేశం ఎటునారం మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నిరుద్యోగులందరికీ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని జాబ్ క్యాలెండర్ ప్రకటించి నోటిఫికేషన్లను వేసి ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టో యూత్ డిక్లరేషన్ ని ప్రకటించడం జరిగింది జాబ్ కేలండర్ నామా మాత్రంగా ప్రకటించిన ఇప్పటివరకు ఆ జాబ్ క్యాలెండర్ ప్రకారం ఏ ఒక్క నోటిఫికేషన్ వేయలేదని అన్నారు సమగ్రమైన వివరాలతో పూర్తి సమాచారంతో జాబు క్యాలెండర్ ని ప్రకటించి ఉద్యోగాల భర్తీకై నోటిఫికేషన్లు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వేయాలి అదేవిధంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే అంతవరకు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి 4000 రూపాయలు ఇవ్వాలి అదే విధంగా స్వయం ఉపాధి రుణాలపై రాజీవ్ యువ వికాస్ పథకాన్ని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడం లేదు దరఖాస్తులకే పరిమితం కాకుండా అర్హులైన నిరుద్యోగ యువత లందరికీ రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా స్వయం ఉపాధి రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అదేవిధంగా ములుగు జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేసి జిల్లాలో ఉన్న యువతను ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు రాష్ట్రంలో ప్రభుత్వం ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ యువతకు గతంలో ఇచ్చిన 46 ఏళ్ల గరిష్ట వయోపరిమితిని కొనసాగించి జాబు నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రత్నం ప్రవీణ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రవీందర్ బి నరేష్ జిల్లా ఉపాధ్యక్షుడు లాజర్ మహేందర్ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు

## ఆమ్చూర్ రైతు ఆగమాగం





**ఉమ్మడి,నిజామాబాద్ ప్రతినిధి, మన దునియా:మే 07**

చెమటోడ్చి పండించిన పంటను మార్కెట్లు తెచ్చిన మామిడి రైతుకు కన్నీళ్లే మిగులుతున్నాయి. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆమ్ చూర్ (మామిడి ఒరుగు) విక్రయించేందుకు వస్తున్న రైతులు వ్యాపారుల సిండికేట్తో నిలువునా దోపిడీకి గురవుతున్నారు. ఇక్కడ వ్యాపారులు చెప్పిందే వేదం.. వారు నిర్ణయించిందే ధర అన్నట్లుగా పరిస్థితి మారింది. అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తుండటంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి రైతులు ఆమూర్ అమ్మకానికి నిజామాబాద్కు తరలివస్తున్నారు. గత సీజన్లో క్వింటాకు రూ.31,000 వరకు పలికిన ధర, ఇప్పుడు ఒక్కసారిగా రూ. 25000లకు పడిపోవడం రైతులను ఆవేదనకు గురి చేస్తోంది. ధర తగ్గించడమే కాకుండా, తూకంలోనూ రైతులను దారుణంగా మోసం చేస్తున్నారు. కాయలు కోయడం, కూలీల ఖర్చులు, హమాలీ, కాంటా ఖర్చులు భరించి మార్కెటు వస్తే.. ఇక్కడ వ్యాపారుల దోపిడీతో అసలు పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు నిజామాబాద్ మార్కెట్లో వ్యాపారుల ఆధిపత్యం ఆరోపిస్తున్నారు. అధికారులు కూడా వ్యాపారులకే వత్తాసు పలుకుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ”కూలీల ఖర్చులు పెరిగాయి, ఎండలో ఎండబెట్టి ఇక్కడికి తెస్తే ధర లేదంటున్నారు. తరుగు పేరిట నిలువు దోపిడీ చేస్తున్నారు. మరో వారం రోజుల్లో పంట భారీగా వచ్చే అవకాశం ఉన్నందున, ఇప్పటికైనా మార్కెట్ కమిటీ అధికారులు స్పందించి ధర, తరుగు విషయంలో వ్యాపారుల ఆగడాలను కట్టడి చేయాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది.

## ముదిరాజ్ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికై ప్రతి జిల్లాలో భవనాలు మంజూరు చేయాలి

**ముదిరాజ్ ల రిజర్వేషన్  వెంటనే అమలు చేయాలి**

**మెపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్**

**మన దునియా,హైదరాబాద్:మే 07**

ముదిరాజ్ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి  కోసం ప్రతి జిల్లా కేంద్రంలో భవనాలు  నిర్మించాలని ,ఎన్నికల్లో ఇచ్చిన మ్యానిఫెస్టో ముదిరాజ్ లను బిసి ఏ  రిజర్వేషన్ ను వెంటనే అమలు చేయాలని గురువారం నాడు హైదరాబాద్ మినిస్టర్స్ భవనంలో మెపా ( ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ)  వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ కలిసి  వినతి పత్రం అందజేసి మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ముదిరాజ్ యువతకు ,విద్యార్థులకు స్కిల్ డెవలప్ మెంట్ కోసం నైపుణ్య అభివృద్ధి  భవనాలు చేపట్టడం ద్వారా అన్ని రంగాల్లో విద్యార్థులు ముందుకు దూసుకెళ్తారన్నారు... రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా  రాష్ట్ర జనాభా ప్రాతిపదికన అధిక జనాభా కలిగిన ముదిరాజ్ లకు సముచిత ప్రాధాన్యం కల్పించి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు,అలాగే నిరుద్యోగ యువతీ యువతకు సాంకేతిక శిక్షణ ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు.ముదిరాజ్ విద్యార్థుల సాంకేతిక,వృత్తి విద్యా నైపుణ్యాలను పెంచేందుకు ప్రత్యేక భవనం ఏర్పాటు చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. నైపుణ్యాభివృద్ధి ముదిరాజ్ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఆధునిక శిక్షణ అందించడం ద్వారా వృత్తి నైపుణ్యాలతో సొంతంగా ఉపాధి పొందేలా  ఉపయోగపడుతుందని అన్నారు.తెలంగాణ ప్రభుత్వం పలు వర్గాల విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ పాఠశాలలు, స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తోంది. అదేవిధంగా ముదిరాజ్ విద్యార్థులకు కూడా ప్రత్యేక స్కిల్ డెవలప్మెంట్ భవనం మంజూరు చేయాలని, దీనికోసం నిధులు కేటాయించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు..ఈ విషయంపై  పశు సంవర్ధక ,క్రీడలు మరియు యువజన సర్వీస్ శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి ముదిరాజ్ గారికి వినతి పత్రం అందజేసినారు.. కార్యక్రమంలో మహబుబాబాద్ జిల్లా మెపా  అధ్యక్షుడు దుండి అశోక్ ముదిరాజ్, మహబుబాబాద్ పట్టణ అధ్యక్షుడు చొప్పరి ప్రశాంత్,మెపా జిల్లా నాయకులు ఆలేటి ప్రవీణ్ ముదిరాజ్  తదితరులు పాల్గొన్నారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# ధాన్యం కొనుగోలు చేయట్లేదని ఆగ్రహించిన రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో









**కలెక్టర్ మేడం ఒక్కసారి కమ్మర్పల్లి రండి**
**రైతుల బాధలు చూడండి**
**సొసైటీ అధికారుల పరిరక్షణ కరువు**

**నిజామాబాద్ జిల్లా,ప్రతినిధి మన దునియా:మే 07**

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం కమ్మర్పల్లి మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించిన రైతులు...తెలంగాణ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయట్లేదని ఆగ్రహించిన రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనుగోలు కేంద్రాల్లో పడి ఉండటమే కాకుండా కొనే దిక్కు లేకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.చాలా చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు దాటి బయటకు వెళ్లడం లేదు. అయినా ప్రభుత్వం పట్టించుకోక పోవడం పై ఆందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలో కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టామని, కొందరు రైతుల వరి ధాన్యం ఇప్పటికే ఆరిపోయినప్పటికీ, ప్రభుత్వం గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కడతా పేరుతో వట్లను కట్ చేసి, రైతులను తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆరోపించారు. డ్రైవర్ కు 2000 రూపాయలు ఇవ్వాలని లారీ డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు. సంచికి 20 రూపాయలు ఇవ్వాలని లేదంటే హమాలీలు మీ వట్లు జోకర్ అని అంటున్నారని రైతులు ఆరోపించారు.ఎలాంటి నిబంధనలు లేకుండా వెంటనే వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుమారు 5 వేల బస్తాలు కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు తరలించేందుకు వాహనాలు సకాలంలో రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.సమాచారం అందుకున్న ఎమ్మార్వో కృష్ణ, ఎస్సై జి. అనిల్ రెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. పై అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. సొసైటీ సెక్రటరీలు అందుబాటులో లేదంటూ. రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీలకు వెళ్లాలంటే స్పష్టమైన సమాచారం అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు. కనీసం సెక్రటరీ వివరాలు కూడా చెప్పడం లేదని రైతులు ఆరోపించారు. కమ్మర్పల్లి సొసైటీ సెక్రటరీ పై చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్ చేశారు.

# మార్ష్ వీరబాదుడు.. వర్షంతో ఆగిన లక్నో-ఆర్సీబీ మ్యాచ్

**ఆర్సీబీతో మ్యాచ్‌లో లక్నోకు అదిరే ఆరంభం**
**ఆకాశమే హద్దుగా చెలరేగిన మిచెల్ మార్ష్**
**కేవలం 32 బంతుల్లో 76 పరుగులతో మార్ష్ విధ్వంసం**
**9 ఓవర్లకు వికెట్ నష్టపోకుండా లక్నో 95 పరుగులు**
**వర్షం కారణంగా తాత్కాలికంగా నిలిచిన మ్యాచ్**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)తో మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) ఓపెనర్ మిచెల్ మార్ష్ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. అయితే వర్షంతో మ్యాచ్ మధ్యలోనే నిలిచిపోయింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నోకు మార్ష్ సుడిగాలి ఆరంభాన్నిచ్చాడు. ఆర్సీబీ బౌలర్లపై మొదటి బంతి నుంచే ఎదురుదాడికి దిగిన మార్ష్, బౌండరీలు, సిక్సర్లతో హోరెత్తించాడు.మార్ష్ కేవలం 32 బంతుల్లోనే 7 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో 76 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మరో ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (17 నాటౌట్) అతనికి చక్కటి సహకారం అందించాడు. దీంతో పవర్‌ప్లే ముగిసేసరికి లక్నో వికెట్ నష్టపోకుండా 68 పరుగులు చేసింది. మార్ష్ దూకుడుతో లక్నో 9 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 95 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ దశలో వర్షం కురవడంతో ఆటకు అంతరాయం కలిగింది. దీంతో అంపైర్లు మ్యాచ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. ఆర్సీబీ బౌలర్లలో ఎవరూ ప్రభావం చూపలేకపోయారు. కాగా, వర్షం తగ్గడంతో మ్యాచ్ మళ్లీ మొదలైంది. అంతకుముందు టాస్ గెలిచిన ఆర్సీబీ కెప్టెన్, ఫీల్డింగ్ ఎంచుకున్నాడు.



## టాస్ గెలిచిన ఆర్సీబీ.. కీలక మార్పులతో బరిలోకి లక్నో

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్ జీ), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్లు కీలక మ్యాచ్ లో తలపడుతున్నాయి. లక్నోలోని ఏకనా స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. దీంతో రిషభ్ పంత్ సారథ్యంలోని లక్నో జట్టు మొదట బ్యాటింగ్ చేయనుంది.ఈ సీజన్‌లో ఇరు జట్ల ప్రదర్శన పూర్తి భిన్నంగా ఉంది. ఆడిన 9 మ్యాచ్‌లలో కేవలం 2 విజయాలు సాధించి, వరుసగా ఆరు ఓటములతో లక్నో పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో ఉంది. ప్లేఆఫ్స్ అవకాశాలు సన్నగిల్లడంతో ఈ మ్యాచ్‌లో గెలిచి తిరిగి పుంజుకోవాలని పట్టుదలగా ఉంది. మరోవైపు, 9 మ్యాచ్‌లలో 6 విజయాలతో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిచి ప్లేఆఫ్స్ బెర్త్‌ను మరింత సుస్థిరం చేసుకోవాలని ఆర్సీబీ చూస్తోంది.టాస్ గెలిచిన అనంతరం ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ మాట్లాడుతూ.. "మేం మొదట బౌలింగ్ చేస్తాం. ఈ పిచ్ బాగుంది, లక్నోను తక్కువ స్కోరుకే కట్టడి చేయాలనుకుంటున్నాం. మా జట్టులో ఎలాంటి మార్పులు లేవు" అని తెలిపాడు. లక్నో కెప్టెన్ రిషభ్ పంత్ మాట్లాడుతూ.. "గాయాల కారణంగా ఇంగ్లిస్, మోసిన్ ఖాన్ దూరం కావడంతో జట్టులో కొన్ని మార్పులు చేశాం. ఈ పిచ్ 180-190 స్కోరుకు అనుకూలంగా కనిపిస్తోంది" అని పేర్కొన్నాడు.రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరువిరాట్ కోహ్లీ, జాకబ్ బెతెల్, దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్ (కెప్టెన్), జితేశ్ శర్మ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్, సుయాశ్ శర్మ.ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: రసిఖ్ దార్, జోర్డాన్ కాక్స్, మంగేష్ యాదవ్, విక్కీ ఓస్త్వాల్, వెంకటేశ్ అయ్యర్.లక్నో సూపర్ జెయింట్స్ మిచెల్ మార్ష్, అర్షిన్ కులకర్ణి, నికోలస్ పూరన్, ఐడెన్ మార్క్‌రమ్, రిషభ్ పంత్ (కెప్టెన్/వికెట్ కీపర్), అక్షత్ రఘువంశీ, హిమ్మత్ సింగ్, షాబాజ్ అహ్మద్, దిగ్వేశ్ సింగ్ రాఠీ, మహమ్మద్ షమీ, ప్రిన్స్ యాదవ్. ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: మయాంక్ యాదవ్, ముకుల్ చౌధరి, అబ్దుల్ సమద్, ఎం సిద్ధార్థ్, అవేశ్ ఖాన్.



## మార్ష్ విధ్వంసక సెంచరీ, పంత్ మెరుపులు.. ఆర్సీబీ ముందు భారీ లక్ష్యం




**లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్ల విధ్వంసం**
**మిచెల్ మార్ష్ 56 బంతుల్లోనే 111 పరుగులతో అద్భుత సెంచరీ**
**చివర్లో 10 బంతుల్లో 32 పరుగులతో మెరిసిన రిషభ్ పంత్**
**వర్షం కారణంగా మ్యాచ్‌ను 19 ఓవర్లకు కుదింపు**
**డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం ఆర్సీబీ ముందు 213 పరుగుల భారీ లక్ష్యం**
**ఛేజింగ్ లో కోహ్లీ డకౌట్**

కీలక మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్ జీ) బ్యాటర్లు విధ్వంసం సృష్టించారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో (ఆర్సీబీ) జరుగుతున్న మ్యాచ్‌లో ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ (111) అద్భుత సెంచరీతో కదం తొక్కడంతో లక్నో జట్టు భారీ స్కోరు సాధించింది. వర్షం కారణంగా 19 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో లక్నో నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది.లక్నోలోని ఏకానా స్టేడియంలో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీ నిర్ణయం బెడిసికొట్టింది. ఆది నుంచే దూకుడుగా ఆడిన మిచెల్ మార్ష్, ఆర్సీబీ బౌలర్లకు చుక్కలు చూపించాడు. కేవలం 56 బంతుల్లో 9 ఫోర్లు, 9 సిక్సర్లతో 111 పరుగులు చేసి లక్నోకు భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు. మరోవైపు, ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (17) నెమ్మదిగా ఆడాడు.మార్ష్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన నికోలస్ పూరన్ (38) కూడా తనదైన శైలిలో రాణించాడు. ఇక చివర్లో కెప్టెన్ రిషభ్ పంత్ మెరుపు ఇన్నింగ్స్ తో చెలరేగాడు. కేవలం 10 బంతులు ఎదుర్కొన్న పంత్.. 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో లక్నో స్కోరు 200 పరుగులు దాటింది. ఆర్సీబీ బౌలర్లలో హేజిల్‌వుడ్, కృనాల్ పాండ్య, రసిఖ్ సలామ్ తలో వికెట్ పడగొట్టారు.డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆర్సీబీ ముందు 19 ఓవర్లలో 213 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది.భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి డబుల్ షాక్.. డకౌటైన కోహ్లీ!భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీ ఆదిలోనే కష్టాల్లో పడింది. వర్షం కారణంగా 19 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో, డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆర్సీబీ ముందు 213 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. ఈ ఛేదనలో బెంగళూరు 1.4 ఓవర్లలోనే కేవలం 10 పరుగులు చేసి రెండు కీలక వికెట్లు కోల్పోయింది.ఆర్సీబీకి ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఓపెనర్ జాకబ్ బెతెల్ (4) మహమ్మద్ షమీ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ వెంటనే, ప్రిన్స్ యాదవ్ వేసిన రెండో ఓవర్లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (0) రెండు బంతులు మాత్రమే ఆడి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. కోహ్లీ డకౌట్‌గా వెనుదిరగడంతో ఆర్సీబీ శిబిరంలో నిరాశ ఆవరించింది.ప్రస్తుతం క్రీజులో దేవదత్ పడిక్కల్ (0), కెప్టెన్ రజత్ పటీదార్ (1) ఉన్నారు. భారీ లక్ష్యాన్ని ఛేదించాలంటే మిగిలిన బ్యాటర్లు అసాధారణ రీతిలో రాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

## మార్ష్ సెంచరీ... వర్షంతో మళ్లీ ఆగిన ఐపీఎల్ మ్యాచ్

**లక్నో, బెంగళూరు మ్యాచ్‌కు వర్షం అడ్డంకి**
**విధ్వంసక సెంచరీతో చెలరేగిన మిచెల్ మార్ష్**
**51 బంతుల్లోనే 107 పరుగులతో అజేయంగా నిలిచిన మార్ష్**
**ఆట నిలిచే సమయానికి లక్నో స్కోరు 14 ఓవర్లకు 145/1**
**టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీకి తప్పని కష్టాలు**

ఐపీఎల్ 2026లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరుగుతున్న మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్ మిచెల్ మార్ష్ విధ్వంసక సెంచరీతో చెలరేగాడు. మార్ష్ మెరుపులతో లక్నో భారీ స్కోరు దిశగా దూసుకెళ్తున్న దశలో వర్షం మరోసారి అంతరాయం కలిగించింది. దీంతో ఆటను తాత్కాలికంగా నిలిపివేశారు. ఆట ఆగే సమయానికి లక్నో 14 ఓవర్లలో వికెట్ నష్టానికి 145 పరుగులు చేసింది.లక్నోలోని ఏకానా స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆర్సీబీ బౌలింగ్ ఎంచుకుంది. అయితే, వారి నిర్ణయం తప్పు అని నిరూపిస్తూ మిచెల్ మార్ష్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 51 బంతుల్లో 9 ఫోర్లు, 9 సిక్సర్లతో అజేయంగా 107 పరుగులు చేసి క్రీజులో ఉన్నాడు. జట్టు మొత్తం స్కోరులో 70 శాతానికి పైగా పరుగులు మార్ష్ చేయడం విశేషం. మరో ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (17) నెమ్మదిగా ఆడి కృనాల్ పాండ్యా బౌలింగ్‌లో ఔటయ్యాడు.అనంతరం క్రీజులోకి వచ్చిన నికోలస్ పూరన్ (14*) కూడా దూకుడుగా ఆడుతుండగా వర్షం మొదలైంది. దీంతో అంపైర్లు ఆటను నిలిపివేసి, మైదానాన్ని కవర్లతో కప్పించారు. ఆర్సీబీ బౌలర్లలో కృనాల్ పాండ్యా ఒక్కడే వికెట్ తీశాడు. మిగతా బౌలర్లందరూ భారీగా పరుగులు సమర్పించుకున్నారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## అవతార్ కష్టాలు: చిక్కుల్లో జేమ్స్ కామెరాన్... అది తన ముఖమే అంటున్న నటి

అవతార్ లో హీరోయిన్ పాత్ర రూపకల్పనపై మొదలైన వివాదం

అనుమతి లేకుండా తన ముఖాన్ని వాడారంటూ నటి ఆరోపణ

డైరెక్టర్ జేమ్స్ కామెరాన్, డిస్నీపై కోర్టులో దావా

నష్టపరిహారంతో పాటు లాభాల్లో వాటా డిమాండ్

స్ఫూర్తి నువ్వేనంటూ గతంలో కామెరాన్ చెప్పినట్లు ఆధారాలు



ప్రపంచవ్యాప్తంగా సినీ చరిత్రలో రికార్డులు సృష్టించిన 'అవతార్' సిరీస్ ఇప్పుడు ఓ భారీ వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమాలోని కీలకమైన హీరోయిన్ 'నేయ్‌తిరి' పాత్రను తన ముఖం ఆధారంగా, ఎలాంటి అనుమతి లేకుండా సృష్టించారని ఆరోపిస్తూ స్థానిక తెగకు చెందిన నటి క్యోరియన్నా కిల్చర్ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరాన్, వాల్ట్ డిస్నీ కంపెనీలను ప్రతివాదులుగా చేర్చారు.క్యోరియన్నా కిల్చర్ 2005లో 'ది న్యూ వరల్డ్' అనే చిత్రంలో నటించారు. అప్పుడు ఆమె వయసు కేవలం 14 సంవత్సరాలు. ఆ సమయంలో ఎల్ఏ టైమ్స్‌లో ప్రచురితమైన ఆమె ఫోటోను జేమ్స్ కామెరాన్ తన డిజైన్ బృందానికి ఇచ్చి, 'నేయ్‌తిరి' పాత్ర ముఖ కవళికలను రూపొందించమని చెప్పారని దావాలో ఆరోపించారు. తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, అనుమతి తీసుకోకుండా, కనీసం గుర్తింపు గానీ, నష్టపరిహారం గానీ చెల్లించకుండా తన బయోమెట్రిక్ గుర్తింపును వాడుకున్నారని ఆమె పేర్కొన్నారు.ఆసక్తికరంగా, ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తూ స్వయంగా కామెరాన్ గతంలో చేసిన వ్యాఖ్యలే ఇప్పుడు కీలకంగా మారాయి. అవతార్ విడుదల తర్వాత ఓ కార్యక్రమంలో కిల్చర్‌ను కలిసిన కామెరాన్, నేయ్‌తిరి పాత్రకు ఆమె అందమే స్ఫూర్తి అని చెబుతూ ఒక స్కెచ్‌పై సంతకం చేసి ఇచ్చారు. అంతేకాకుండా, ఓ ఇంటర్వ్యూలో కూడా "నేయ్‌తిరి పాత్రకు అసలు మూలం ఎల్ఏ టైమ్స్‌లోని క్యోరియన్నా కిల్చర్ ఫోటోనే. ఆమె ముఖంలోని కింది భాగం చాలా ఆసక్తికరంగా ఉంటుంది" అని కామెరాన్ చెప్పిన వీడియో గతేడాది వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.స్థానిక ప్రజల హక్కుల గురించి మాట్లాడినట్లు కనిపించే అవతార్ సినిమా, వాస్తవానికి ఓ స్థానిక అమ్మాయి గుర్తింపును ఆమెకు తెలియకుండా వాడుకుందని దావాలో ఆరోపించారు. ఈ నేపథ్యంలో తనకు నష్టపరిహారంతో పాటు, సినిమా లాభాల్లో వాటా ఇవ్వాలని, బహిరంగంగా ఈ తప్పును సరిదిద్దాలని కిల్చర్ డిమాండ్ చేస్తున్నారు. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో విచారణ దశలో ఉంది.

## తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ.. విజయ్ కు ప్రకాశ్ రాజ్ మద్దతు

118 మంది ఎమ్మెల్యేలు ఉంటేనే ప్రభుత్వ ఏర్పాటు అంటున్న గవర్నర్

విజయ్ కు తగ్గిన ఎమ్మెల్యేల సంఖ్యాబలం

అసెంబ్లీలో లో బలం నిరపించుకునే అవకాశం ఇవ్వాలన్న ప్రకాశ్ రాజ్

తమిళనాడు రాజకీయాల్లో ప్రభుత్వ ఏర్పాటుపై నెలకొన్న సందిగ్ధత ఇప్పుడు న్యాయపోరాటం దిశగా మారుతోంది. ఈ ఉత్కంఠభరిత పరిణామాలపై నటుడు ప్రకాశ్ రాజ్ స్పందిస్తూ గవర్నర్ తీరును తప్పుబట్టారు. ప్రజల మద్దతు పొందిన నాయకుడికి అసెంబ్లీ వేదికగా బలాన్ని నిరూపించుకునే అవకాశం ఇవ్వాలని, రాజ్యాంగపరమైన ప్రక్రియను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన విమర్శించారు. మెజారిటీని సభలోనే తేల్చాలే తప్ప, ముందే గవర్నర్ అడ్డంకులు సృష్టించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు.టీవీకే అధినేత విజయ్ ఇప్పటికే గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే, మ్యాజిక్ ఫిగర్ 118కి ఎమ్మెల్యేల మద్దతు తక్కువగా ఉండటంతో, మద్దతు లేఖలు లేకుండా గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేమని గవర్నర్ స్పష్టం చేశారు. దీనికి ప్రతిస్పందనగా, తనకు సభలో బలాన్ని నిరూపించుకునే అవకాశం ఇవ్వాలని విజయ్ కోరుతున్నారు. ఒకవేళ గవర్నర్ తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే, విజయ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. బొమ్మై కేసు తీర్పు ప్రకారం మెజారిటీని సభలోనే నిరూపించుకోవాలనే నిబంధనను ఆధారం చేసుకుని సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం కనిపిస్తోంది.మరోవైపు, కావలసిన ఆరుగురు ఎమ్మెల్యేల మద్దతు కోసం విజయ్ బృందం తీవ్రంగా శ్రమిస్తోంది. అన్నాడీఎంకేలోని అసంతృప్త వర్గం లేదా ఇతర చిన్న పార్టీల ఎమ్మెల్యేల నుంచి మద్దతు కూడగట్టే ప్రయత్నాలు తెరవెనుక వేగంగా జరుగుతున్నాయి. ఒకవేళ సంఖ్యాబలం సమకూరితేనే రాజ్‌భవన్ నుంచి పిలుపు వచ్చే అవకాశం ఉంది. దీంతో తమిళనాడు రాజకీయాలు ఇప్పుడు అటు రాజ్‌భవన్, ఇటు కోర్టు మెట్ల మధ్య దోబూచులాడుతున్నాయి. విజయ్ తదుపరి అడుగు ఎటు పడుతుందనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది



## 'సిటాడెల్ 2' (అమెజాన్ ప్రైమ్) సిరీస్ రివ్యూ!

ప్రియాంక చోప్రా .. రిచర్డ్ మాడెన్ ప్రధానమైన పాత్రలను పోషించిన 'సిటాడెల్' సిరీస్ లో, సీజన్ 1కి విశేషమైన ఆదరణ లభించింది. స్పై థ్రిల్లర్ జోనర్లో రూపొందిన ఈ సిరీస్, యాక్షన్ సీక్వెన్స్ వైపు నుంచి మంచి మార్కులు కొట్టేసింది. అలాంటి ఈ సిరీస్ నుంచి సీజన్ 2 ఎప్పుడు వస్తుందా అని అంతా ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 6వ తేదీ నుంచి సీజన్ 2 స్ట్రీమింగ్ కి వచ్చింది. 7 ఎపిసోడ్స్ గా రూపొందిన ఈ సిరీస్, ఇంగ్లిష్ తో పాటు వివిధ భాషల్లో అందుబాటులో ఉంది.ప్రపంచంలోని అత్యంత సంపన్నులచే 'మాంటికోర్' అనే ఒక వ్యవస్థ కొనసాగుతూ ఉంటుంది. హత్యలు చేయించడం మొదలు .. ప్రభుత్వాలను మార్చేయగల ఉన్మాదుల వ్యవస్థగా అది కొనసాగుతూ ఉంటుంది. 'మాంటికోర్'కి అడ్డుకట్ట వేయడానికి 'సిటాడెల్' అనే ఒక గూఢచారి వ్యవస్థ రంగంలోకి దిగుతుంది. ఆ గూఢచారి విభాగంలో నాడియా (ప్రియాంక చోప్రా) మేసన్ కేన్ (రిచర్డ్ మాడెన్) బెర్నార్డ్ పనిచేస్తూ ఉంటారు. కానీ ఆ ఏజెంట్లు అందరూ ఇప్పుడు చల్లాచెదురై ఉంటారు. అందుకు కారణం మేసన్ కేన్ తల్లి దాలియా.దాలియా 'మాంటికోర్'లో పనిచేస్తుందని తెలియని మేసన్, తమ గూఢచారి సంస్థకి సంబంధించిన ఏజెంట్ల జాబితాను ఆమెకి ఇస్తాడు. అలా చాలా మంది ఏజెంట్లు చనిపోవడానికి అతను కారకుడవుతాడు. ఆ ప్రమాదకర పరిస్థితి తరువాత, మేసన్ .. నాడియా .. బెర్నార్డ్ తలో దిక్కు అవుతారు. 'ఆబీ'ని పెళ్లి చేసుకున్న మేసన్, ఆమెతో ఆనందకరమైన జీవితాన్ని గడుపుతూ ఉంటాడు. నాడియా తన కూతురు 'ఆషా'తో కలిసి జీవిస్తూ ఉంటుంది.ఇక బెర్నార్డ్ మాత్రం 'పోలో బ్రాగా' స్థావరంలో బందీగా ఉంటాడు. బెర్నార్డ్ తో పోలో మైండ్ కంట్రోల్ ప్రోగ్రామ్ ను తయారు చేయిస్తూ ఉంటాడు. ఒక వ్యక్తి మెదడులో మైక్రో చిప్ ను అమర్చి, తన ఆదేశాలను ఆ వ్యక్తి పాటించేలా చేయడమే ఆ ప్రోగ్రామ్ ఉద్దేశం. అలా తయారు చేసిన వ్యక్తితో ఒక దేశ అధ్యక్షుడిని చంపించాలానే ఆలోచనలో పోలో ఉంటాడు. అలాంటి పరిస్థితులలో అక్కడి నుంచి బెర్నార్డ్ తప్పించుకుంటాడు. అలా తప్పించుకున్న బెర్నార్డ్, మాజీ సీఐఏ ఆఫీసర్ 'హచ్ జిమ్' ఆశ్రయాన్ని పొందుతాడు. హచ్ కూడా పోలో పై ప్రతీకారం తీర్చుకునే ఉద్దేశంతో ఉంటాడు. అతని సాయంతో తన మిగతా టీమ్ సభ్యులను కలుసుకునే దిశగా బెర్నార్డ్ ముందుకు వెళతాడు. తన టీమ్ ను చేరుకున్న నాడియా ఏం చేస్తుంది? తన తల్లి చేసిన ద్రోహానికి ప్రతిగా మేసన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడు? మాంటికోర్ నుంచి మానవాళిని కాపాడటం కోసం వాళ్లు ఏం చేస్తారు? అనేది కథ.మెదడులో అమర్చబడిన మైక్రో చిప్ కారణంగా, తన ఆదేశాలను పాటిస్తూ మానవాళిపై విరుచుకుపడే హంతకులను తయారు చేయించడానికి పోలో రంగంలోకి దిగడంతో ఈ సిరీస్ మొదలవుతుంది. గతంలో చెల్లాచెదురైపోయిన 'సిటాడెల్' ఏజెంట్లు, నిదానంగా కోలుకుని తిరిగి ట్రాక్ లో పడుతూ ఉండటంతో ఈ కథ జోరందుకుంటుంది. 'సిటాడెల్' టీమ్ అంతా ఒక దగ్గరికి చేరుకున్న దగ్గర నుంచి ఉత్కంఠభరితంగా మారుతుంది. 'సిటాడెల్'కి సంబంధించిన ఏజెంట్లకి ఎదురయ్యే ప్రమాదకరమైన సంఘటనలు, వాటి బారి నుంచి వాళ్లు బయటపడే తీరు ఆడియన్స్ లో ఆసక్తిని రేకెత్తిస్తూ ఉంటుంది. తమ ఆపరేషన్ కి అవసరమైన 'ఎడిసన్' ను పట్టుకోవడానికి సిటాడెల్ ఏజెంట్లు ప్లాన్ చేసిన తీరు బాగుంది. అయితే మొదటి మూడు ఎపిసోడ్స్ తరువాత కథ కాస్త నిదానంగా నడుస్తూ వెళుతుంది. మేసన్ .. అతని తల్లికి సంబంధించిన సన్నివేశాలను, సంభాషణలతో సాగదీసిన భావన కలుగుతుంది. 'సిటాడెల్' మొదటి సీజన్ .. భారీతనమే ప్రధానమైన ఆకర్షణగా నిలిచింది. అందుకు ఎంత మాత్రం తగ్గని నిర్మాణ విలువలతో ఈ సిరీస్ ఆకట్టుకుంటుంది. కథా పరంగా ట్విస్టులు ఉన్నప్పటికీ, అవి కొత్తగా ఏమీ అనిపించవు. యాక్షన్ సినిమాలను ఇష్టపడేవారిని అలరించే రీతిలోనే యాక్షన్ సీక్వెన్స్ ఆకట్టుకుంటాయి. కథలో ఎమోషన్స్ కి పెద్దగా ఛాన్స్ ఇవ్వలేదు .. ఉన్న కొద్ది ఎమోషన్ కనెక్ట్ కాలేదు.పోలో పాత్రను ఒక రేంజ్ లో పరిచయం చేశారు. తనదైన ప్రత్యేకమైన నేర సామ్రాజ్యాన్ని స్థాపించిన పోలో, దేశ అధ్యక్షులను టార్గెట్ చేసే స్థాయిలో చక్రం తిప్పుతుంటాడు. అయితే ఆ తరువాత చోటుచేసుకునే సన్నివేశాలు ఆ పాత్ర స్థాయిని తగ్గించినట్టుగా అనిపిస్తుంది. అతను బంధించబడిన దగ్గర నుంచే కథ కాస్త నీరసించినట్టు కనిపిస్తుంది. నటీనటుల నటన మెప్పిస్తుంది. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ పనితీరు బలంగానే కనిపిస్తుంది. ఇది స్పై థ్రిల్లర్ కావడం వలన, అందుకు తగినట్టుగానే ఛేజింగులు .. యాక్షన్ సీన్స్ ఆకట్టుకుంటాయి. కథ రొటీన్ గా అనిపిస్తుంది. కథనం నిదానంగా సాగుతుంది. అభ్యంతరకరమైన సన్నివేశాలు .. సంభాషణలు ఉన్నాయి. అందువలన నలుగురితో కలిసి చూడటం కాస్త ఇబ్బందినే కలిగిస్తుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com